తోడికోడళ్ళు

యన్ శ్రీకృష్ణారావు

"ఊరంతా మార్మోగుతోంది. మీ అన్నయ్యగారి అమ్మాయి పెళ్ళి, అబ్బాయి ఒడుగూను" అంది శ్యామల ఎత్తిపొడుస్తున్నట్లు.

ఏదో పుస్తకం చదవటంలో లీనమైన భర్త రాఘవరావు తలకదపకుండానే, "అవును" అన్నాడు.

'అవునుమరి. ఊళ్ళో చాలా పెద్దమనిషాయె!'

'ఉమ్!'

'ఆఫీసర్లు, వ్యాపారస్తులు, భాగ్యవంతులు—ఒకళ్ళేమిటి? డబ్బున్నవాళ్ళందరూ వస్తారు. వాళ్ళేకదా వాళ్ళకి కావలసినవాళ్ళు?'

"సర్లే. నువ్వు కొంచెం నోరుమూసుకో."

'ఏం? మీ అన్నగారిని ఏమైనా అంటే మీకు కోపం ముంచుకొస్తోంది కాబోలు!'

'అనవసరంగా నన్నెందుకు దెప్పిపొడుస్తావు?'

'ఏం? అన్నగారిమీద అంత ప్రేమగా వుంటే వెళ్ళండి. నేనేం వద్దన్నానా?'

'నువ్వూ, వదినా వున్న లక్షణానికే మేము యిల్లా వున్నాం!'

శ్యామలకు చటుక్కున ఏడుపొచ్చేసింది.

"ఏమైనప్పటికి అన్నా తమ్ములు ఇద్దరూ ఒక్కటే. మధ్య పరాయిదాన్ని నేనే కదూ? వెళ్ళి వాళ్ళనే అంటిపెట్టుకొని వుండండి. నాకేం పట్టింపులేదు. కాని నేను మాత్రం వాళ్ళతో వుండను. నా పిల్లాణ్ణి ఆవిడగారు అన్న మాటలు నేను మర్చిపోతానా? మీరు మర్చిపోయారేమో మరి?"

రాఘవరావు తనచేతిలోవున్న పుస్తకాన్ని 'సీరియస్'గా బల్లమీదకు గిరవాటు వేశాడు.

'మొదలెట్టావా మళ్ళీ? వదిన అన్నమాటలకు నాకుమాత్రం బాధగా లేదా? ఆ తర్వాతనేకదా ఆ ధనగర్వితులతో బంధుత్వాన్ని తెంపేసుకొన్నాను? అన్నీ తెలిసికూడా యింకా దెప్పుతావెందుకు?' అన్నాడు.

శ్యామల ఆలోచనలో ములిగింది...

"తను ఒక పెద్ద కంపెనీకి సొంతదారుడై పోయాడు. తనకళ్ళకి నేను తమ్ముడిలా కనిపించటంలేదు. ఒక సాధారణ గుమాస్తాగా నే కనిపిస్తున్నాను. నన్ను అంత హీనంగా చూసే తను నాకు అన్నయ్య అయితే నాకెందుకు! మరొకరైతే నాకెందుకు? తనకూ నాకూ వున్న బంధుత్వం ఏనాడో తెగిపోయింది. లేకపోతే ఈ సమయంలో నేను వెళకుండా వుంటానా?"

"మీ అన్నగారికి కావలసినవాళ్ళు..."

"డబ్బున్నవాళ్ళు! నాకు తెలుసు. లక్షాధికారులతోనూ, కోటీశ్వరులతోనూ తనకి బంధుత్వం వున్నప్పుడు ఈ తమ్ముడు తన కెందుకు?"

'ఆ మహాతల్లి - మీ వదిన - చిన్నపిల్లాడనేనా ఆలోచించకుండా నోటికొచ్చినట్లల్లా మాట్లాడేసిందే!"

మూడేళ్ళకిందట జరిగిన ఆ సంఘటన శ్యామల మర్చిపోలేదు. మొదటి నుంచి శ్యామల మనస్సు ఆమె తోడికోడలు చంచల విషయంలో గురగుర లాడుతూనే వుంది. చంచల రెండు వందలు విలువ ఖరీదు చేసే సిల్కు చీరకట్టుకొని శ్యామల ఎదురుగా తిరుగుతూ కావాలనే ఆర్భాటం చేసినప్పుడు, శ్యామల కట్టుకొన్న యాభయి రూపాయల చీర ఆమెకు అదొక అవమానచిహ్నంగానే తోచేది! చంచల వజ్రాలతో పొదిగిన నగలు మెడనిండా పెట్టుకొని తిరుగుతూంటే, శ్యామల దుఃఖంతో కృంగిపోయేది. ఒకసారి డెబ్భై రూపాయలచీర కట్టుకొంది శ్యామల. అప్పుడు చంచల శాంతంగా "మా దాసీదానికి ఇటువంటి చీరే కొన్నాను నిన్న" అంది! ఆ మాటలు శ్యామల మనస్సులో ఈటెలా గుచ్చుకు పోయాయి! ఇటువంటి చిన్న చిన్న విషయాల్లో తోడికోడళ్ళలో కలిగే మనస్పర్థలకు బాధపడి అన్నదమ్ములు ఇద్దరూ విడిపోయారు. అప్పటికి వారు విడిపోయి అయిదుసంవత్సరాలు దాటింది.

శ్యామలకొడుకు రామానికి అప్పుడు నాలుగుఏళ్ళు. ఒక పండగరోజున అన్నగారి బలవంతంమీద రాఘవరావు, భార్యాపుత్రులతో సహితంగా భోజనానికి అన్నగారింటికి వెళ్ళాడు. ఆడవాళ్ళు, మగవాళ్ళు పిల్లలూ అందరూ ఒకేపంక్తిని భోజనానికి కూర్చున్నారు. వంటవాడు పదార్థాలన్నీ వడ్డిస్తూ అందరితోపాటు శ్యామల కొడుకుకి కూడా ఒక లడ్డూ వేశాడు. వెంటనే కోపం తెచ్చుకొన్న చంచల "ఇప్పుడు వీడికెందుకు ఈ లడ్డూ? ఇందాక తిన్నాడుగా? అస్తమానూ తింటే జబ్బు చేస్తుంది" అంటూ చటుక్కున ఆవిస్తట్లో వున్న లడ్డూని తీసేసి ఆమెకూతురి విస్తట్లో వేసేసింది.

ఆ సమయంలో తోడికోడలుమీద శ్యామలకు వచ్చినకోపం వర్ణించ సాధ్యం కాదు. మాటమీద మాటలు పెరిగాయి. చటుక్కున ఆమె కూర్చున్న విస్తరి ముందు నుంచిలేచి, ఆమె కొడుకుని చంకన వేసుకొని, భర్తవైపు తీక్షణంగా చూసి ఇంటి దారి పట్టింది శ్యామల. భార్య వెనకాలే రాఘవరావుకూడా లేచి వెళ్ళిపోయాడు.

"మనం అంతా బీదవాళ్ళం అన్నమాట! ఒకలడ్డూకి కూడా గతిలేని వాళ్ళం" అంది శ్యామల ఇంటికి తిరిగి వచ్చేశాక, భర్తను ఎత్తి పొడుస్తున్నట్లు.

"వాళ్ళకి మనం కావలసిన వాళ్ళం కాము. భాగ్యవంతులే వాళ్ళకి బంధువులు, స్నేహితులు" అన్నాడు జవాబుగా రాఘవరావు.

"ఇటువంటి అఘాయిత్యం ఏదో ఒకటి ఆవిడగారు చేస్తుందని నాకుముందే తెలుసు. అందుకనే నేను అక్కడికి రానన్నాను. బలవంతాన తీసికెళ్ళారు-ఇందుకే!"

వారందరూ ఒకేఇంట్లో కలసివున్న రోజుల్లో నిత్యమూ చంచల ఎత్తిపొడుపుల్లో శ్యామల దుఃఖంతో కృంగిపోయేది. తత్ఫలితంగా వారు విడిపోయారు. ఆ చిన్న చిన్న విషయాలకన్నా ఆపండగనాడు చంచల అన్నమాటలు శ్యామలను విపరీతమైన వేదనకు గురిచేశాయి. అదంతా ఆమె మర్చిపోలేదు.

తోడికోడళ్లు మాటి మాటికీ ఏదోఒక విషయంలో తగవులాడు కొంటూనే వుంటారు. ఇది అందరి ఇళ్ళలోనూ వుండేదే. అటువంటి వన్నీ మనసులో పెట్టుకోకు. వీలైనప్పుడల్లా వస్తూ పోతూ వుండు' అని అన్నగారైన సోమయాజులు ఎన్నిసార్లు చెప్పినా, రాఘవరావు మళ్ళీ వాళ్ళింటికి వెళ్ళలేదు.

"ఇంకా అన్నతమ్ములేమిటి? ఆబంధం ఆనాడే తెగిపోయింది. నే నెవరో? తనెవరో!" అని గొణుకున్నాడు రాఘవరావు.

వంటింట్లోకి వెళ్ళి భర్తకు భోజనం వడ్డిస్తున్న శ్యామల భర్తను ఎత్తిపొడిచింది. మళ్ళీ "అంత బాధగావుంటే ఇప్పుడు మించిపోయిందేమీ లేదు. వెళ్ళరండి మీ విస్తట్లో కూడా నాలడ్డూలు పెటకుండా వుంటారు?"

"గోరుచుట్టుమీద రోకటిపోటులా దెప్పి పొడవటంలో ఈ ఆడవాళ్ళకి ఎందుకో ఇంత సంబరం?" అనుకొంటూనే వంటింట్లోకి వచ్చిన రాఘవరావు "ఏం వండావు?" అన్నాడు కోపంగా.

"మనింట్లో ఏం వండుకొంటాం? చింతపండు పచ్చడి; చారునీళ్ళు; కావాలంటే మీ అన్నగారి యింట్లోనుంచి......"

"నోర్ముయ్!"

మౌనంగా భోజనం సాగించాడు రాఘవరావు.

"నిన్నటి విందు చాలా గొప్పగా జరిగిందిట."

రాఘవరావు మాట్లాడలేదు.

"విన్నారా?"

"అంతా విన్నాను"

"మీకు మాత్రం ఏమీ లేదు!"

రాఘవరావు మాట్లాడలేదు.

"నాలుగు కూరలుట! నాలుగు పచ్చళ్లుట! నాలుగు పిండివంటలుట! అది...యిది...ఓ...ఎవర్కూ కూడా అన్నీ తినలేక, ఎవళ్లిష్టం వచ్చినటు వాళ్ళు పారేశారుట. మిగిలిపోయినవన్నీ గోతిలో పారబోశారుట. చేతకానితనం! ఛ!" అంది శ్యామల వేపకాయ తిని ఉమ్మివేస్తున్నట్లు.

"మజ్జిగ," అన్నాడు రాఘవరావు.

"పెళ్ళిలోనే కొడుకు ఒడుగు కూడా— తొమ్మిదో ఏటే చెయ్యటం ఆచారమట. ఇదేం గురుకులం అనుకొంటున్నారు కాబోలు"

"ఏడో ఏట ఒడుగు చెయ్యటం ఆచారం, శాస్త్రసమ్మతం"

"అయితే మన రామానికి కూడా ఒడుగు చెయ్యాల్సిన వయస్సే నన్నమాట. మనం వాళ్ళమాదిరిగా కాకుండా ఈ సంవత్సరం లోనే ఒడుగు చేసే బాగుంటుందిగా?"

"అన్నీ బాగుండివుంటే, వాడితోపాటే వీడికి కూడా ఈ ముహూర్తానికే ఒడుగు చేసేవాళ్ళం."

శ్యామలకు కోపం ముంచుకొచ్చేసింది.

'ఏం వాళ్ళ దయాదాక్షిణ్యాలలో మనం బతకాలా? ఆ మహాతల్లి రేపట్నుంచి 'బీదవాళ్ళు మా యింటికివచ్చి డబ్బు ఖర్చులేకుండా పిల్లాడికి ఒడుగుచేసేసుకొన్నారు' అని నన్ను దెప్పిపొడవటానికా? నా పిల్లాడు దిక్కూ మొక్కూలేని అనాథ యేం కాదు.'

'నేను మజ్జిగ అడిగాను'

'వాళ్ళు డబ్బున్నవాళ్ళు అయితే ఊరంతా వాళ్ల చెప్పుచేతల్లోనే వుండాలనా?'

'మజ్జిగ పొయ్యమని చెప్పి అరగంట అయింది.'

'అరెరె...కోప్పడకండి' అంటూ మజ్జిగ పోసింది శ్యామల.

మర్నాడు తెల్లవారకట్లే మూడు గంటలకే లేచింది శ్యామల. 'ఈ పాటికి చంచల లేచివుంటుంది. వంటవాళ్ళు ఒకపక్క కూరలూ అవీ తరుగుతూ, మరొకపక్క కాఫీ ఫలహారాలూ తయారుచేస్తూవుంటారు. పెళ్ళికూతురుకూడా లేచేవుంటుంది. అసలు దాని

సర్కస్ మొదలుపెట్టిన కొంతసేపటికి ఒక లావుపాటి లక్ష్మయ్య చీకట్లో సీటుకోసం తడుముకుంటూవచ్చాడు. ఒకాయన కాలుతొక్కేసి "అయ్యా, క్షమించాలి. మీ కాలు నేను తొక్కినట్లున్నాను," అన్నాడు.

"అవును మీరే తొక్కుతుంటారు. ఇంకా ఏనుగుల్ని రంగంలోకి తీసుకురాలేదుగా" అన్నాడు రెండో ఆయన.

☆ తోడికోడళ్లు ☆

నిద్రపడుతుందా...దాని తమ్ముడు యింకా నిద్రపోతూనే వుంటాడు. ఒడకి పెళ్ళికొడుకుని అప్పుడే లేపటమెందుకని చంచలకూడా మాట్లాడకుండా. అటూ ఇటూ తిరుగుతూ హడావుడి చేస్తూవుంటుంది...'

ఆరుగంటలయేసరికి నిద్రమంచం మీద నుంచి లేచింది శ్యామల. భర్తకు కాఫీ ఇస్తూ పెళ్ళివారింటి ప్రసంగం మళ్ళీ తీసుకొచ్చింది.

"ఇవాళ అక్కడ చాలా హడావుడిగా వుంటుంది."

రాఘవరావు మాటాడలేదు.

"ఎవరెవరు వచ్చారో! ఏమేం తెచ్చారో! కొన్ని విషయాలు అబద్ధమేమో!"

కాఫీ తాగుతున్న రాఘవరావు భార్యను ఆశ్చర్యంగా చూశాడు. "ఏమిటి ఎత్తు? అక్కడికి వెళ్ళాలనివుందా నీకు?"

"వెళ్ళిచూస్తే తమాషాగా వుంటుందిగా. గొప్పవాళ్ల ఆడంబరం ఎల్లావుందో కొంచెం చూడవచ్చు. మనల్ని హీనంచేసేవాళ్ళు ఏ విధంగా గొప్పవాళ్ళో చూడచ్చు."

రాఘవరావుకి కోపం వచ్చింది.

"మనం డబ్బులేనివాళ్లమని నీకు తెలీదూ? అక్కడికివెళ్తే అవమానపడాల్సి వుంటుంది."

"మనకి శుభలేఖ పంపారే?"

"మన వీధిచివర ఓ సన్యాసి వున్నాడు తెలుసా? వాడికి కూడా శుభలేఖ పంపారు. శుభలేఖ పంపారుట! శుభలేఖ! ఈవిడ గారికి వెళ్లాలని వుందిట!"

"వాళ్లగర్వమంతా మనకు తెలిసినదే. అయినప్పటికీ......"

"ఓహో! నీకు వెళ్లాలనివుంటే వెళ్లి ఆ పందిట్లో గంతులేసి నాట్యం చెయ్యి!"

"ఊళ్లోవాళ్లంతా ఏమనుకొంటారు?"

"నీ మనసులోది దాచటానికి ఊళ్లో వాళ్లని అడ్డంపెట్టుకొంటా వెందుకు? నేను తన తమ్ముణ్ణి కాదన్నట్లు వన్ను తోసేశాడు. తనకీ నాకూ ఏ సంబంధమూలేదు. ఊళ్లో వాళ్లకి భయపడి ఆ యింటి నీడ తొక్కటంకూడా నాకు ఇష్టంలేదు."

శ్యామల చాలాసేపు దీర్ఘాలోచనలో పడింది. కాని తనమనస్సును కట్టుబాటుచేసుకోలేకపోయింది. గబగబా తనకున్న చీరల్లో మంచి చీర నొకదాన్ని కట్టుకొని మస్తుమస్తుగా ముస్తాబైంది. పెళ్లివారింటికి వెళ్లింది ఒంటరిగానే, భర్త ఇష్టానికి వ్యతిరేకంగా!

"ఎంత పెద్ద పందిరి! మూడు వేల మంది దాకా కూర్చోవచ్చు. ఎక్కడచూసినా ఒకటే హడావుడి! గొప్పగొప్ప వాళ్లంతా ఎవరెవరో వస్తూనేవున్నారు. పెట్టిపుట్టిన వాళ్లు" అనుకొంటూ పెద్ద నిట్టూర్పు విడిచింది శ్యామల.

శ్యామల లోపలికి వెళ్లింది. చంచల ఎదురైంది. తోడికోడళ్లు ఇద్దరూ తమలో రగులుతున్న పగను చిరునవ్వుతో కప్పివేశారు.

"చాలా హడావుడిగా వుందే అక్కా! ఊళ్ళోవాళ్లంతా ఇవాళ ఇక్కడే వున్నట్లున్నారు?"

"అవును మరి. ఎవరిని వదిలిపెట్టగలం చెప్పు? అందరూ కావలసినవాళ్ళే నాయె."

"నిజమే మరి. డబ్బున్న వాళ్లకదా? బీద వాళ్లయితే తోబుట్టువులయినా వదిలి వేయవచ్చు!"

"బీదవాళ్లమాత్రం తక్కువవాళ్ళేమిటి? గొప్పవాళ్లకి డబ్బుంటే, వాళ్లకు నోరుంది."

"పోనీ దాని వేనా మనకెందుకులే అని వదిలేస్తారా గొప్పవాళ్లు? డబ్బున్నవాళ్లు ఆ విషయంలో కూడా డబ్బున్నవాళ్ళే."

"భలే దానివే నువ్వు! దానికేం గాని ఈ నెక్లస్ ఎల్లావుందో చూడు. మంచి నెక్లస్ ఒకటి కావాలని మీ బావగారితో చెప్పాను. చాలా బాగా రెండు వేలకి కొన్నారు యిది. బాగుందికదూ?"

దెబ్బ బాగా ఘాటుగాతగిలింది. శ్యామల తలవంచుకొని నిలబడిపోయింది. పందిట్లోనూ, కనిపించే ఐశ్వర్య చిహ్నాలు ఆమె మనస్సును వేదనకు గురిచేశాయి. చంచల తల్లిని చూసి 'మనవరాలికి పెళ్లివారు ఏమేం చేయించారండీ" అంటూ పలకరించింది శ్యామల.

"కాఫీ తాగావా?" అని అడుగుతూనే లోపలికి వెళ్లిపోయింది చంచల.

చంచల తలి కట్నం కానుకలను గురించి పెద్ద లెక్చర్‌లా వర్ణించేసింది. ఇంట్లో జరిగే కోలాహలం, గొప్పవారికి జరుగుతున్న మర్యాదలు చూసి శ్యామల నిట్టూర్చింది.

సోమయాజులు శ్యామలను చూసి పలకరించాడు. "ఏమ్మా! శ్యామలా! నువ్వు ఒక్కర్తివే వచ్చావా? తమ్ముడు రాలేదా?"

"ఆయన రావటానికి సందర్భం కుదరలేదు."

"చిన్నకూడా వాడు రాలేదు. వాడు ఇంత పెంకివాడుగా మారిపోతాడని నేను అనుకోలేదు."

శ్యామల తన కోపాన్ని ఆపుకోలేకపోయింది.

"మనస్సులు వేరయిన తరువాత అల్లాగే వుంటుంది."

"వాడిమనస్సే వేరుపడింది. నాకేం? అందరితోనూ నేను తనకి అన్నయ్యను కాదని చెప్పుకొంటున్నాడు. నేనేం చెయ్యను?"

"ఇప్పుడెందుకు ఈ మాటలన్నీ? ముహూర్తసమయం కావచ్చింది. త్వరపడండి," అని భర్తను హెచ్చరించింది చంచల.

"ఇదుగో వచ్చేస్తున్నాను. ఒక్క నిముషం. శ్యామలా! తాశీల్దారుగారి భార్యా, పిల్లలూ వచ్చారు. వాళ్లని మర్యాద చెయ్యమ్మా!" అంటూ మేడమీదకు వెళ్లాడు సోమయాజులు.

"నేను పందిట్లోకివెళ్లి కూర్చుంటాను అక్కా! మీ ఇంటికివచ్చే ఆఫీసర్లని, భాగ్యవంతులని ఎల్లా గౌరవించాలో నాకేం తెలుసుచెప్పు?" అంటూ శ్యామల పెళ్ళి పందిరివైపు వెళ్ళింది.

కొన్నిక్షణాల్లోనే "అయ్యబాబోయ్!", "అమ్మా" అంటూ వినిపించిన కేకలు శ్యామల ఆలోచనలకు 'సడన్‌బ్రేక్" వేశాయి. శ్యామల లోపలకి వచ్చింది. అప్పటికే మేడ మెట్లదగ్గర ఒక గుంపు పోగయింది.

చంచల గర్జించింది, "మేడమెట్లమీద అరటి తొక్కలు పారేసిన వెధవ ఎవడు?"

ఏకధాటిగా మ్రోగుతున్న సన్నాయి, బ్యాండు వాయిద్యాలు అకస్మాత్తుగా ఆగిపోయాయి. మేడమెట్లదగ్గర చేరిన గుంపులో యిద్దరు ముగ్గురు కలసి, సోమయాజుల్ని ఒక మంచంమీదకు చేర్చారు. నిముషాలమీద డాక్టరు పరిగెత్తుకొచ్చాడు. మేడమెట్లమీద కాలుజారి దొర్లికిందపడిన సోమయాజులు, తగిలిన దెబ్బలవల్ల కలిగే బాధను భరించలేక గట్టిగా మూలుగుతూ పడివున్నాడు మంచం మీద.

గబగబా ఏదో మందులువేసి కట్లుకట్టాడు డాక్టరు.

"దెబ్బలు చాలా ఎక్కువగా తగిలాయి. చిన్నపిల్లల విషయంఅయితే వేరు. వయస్సు ముదిరినవారుకదా. రెండు మూడు నెలల దాకా కాలు కింద పెట్టటానికి వీల్లేదు" అన్నాడు డాక్టరు.

డాక్టరు మాటలు విని అక్కడ చేరిన వాళ్ళంతా నిశ్చేష్టులైపోయారు.

"ఈ ఒడుగూ, పెళ్ళి ఎవరు చేస్తారు ఇప్పుడు? ఆగిపోవల్సిందేనా?" అని అంతా గుసగుసలాడుకొన్నారు. ఒక డబ్బుగలాయన ఆ మాట బయటికే అనేశాడు.



నారసింహ లేహ్యము

బంగారుతో చేరినది. మేహము, క్షయ, విస్ఫోటకవగైరా హరించి బలము రక్తవృద్ధికల్గించును 20 తులములు రు 3-4-0. పోస్టేజిరు 1-1-0

పి. వి. ఎ. అండ్ కంపెనీ ఆయుర్వేద వసూతిం పెరిదేపి (PO) నెల్లూరుజిల్లా.

"నా పిల్లలమీద ఏ మహాతల్లి కన్ను పడిందో! దాని నోట్లో దుమ్ముపడ!" అంటూ తిట్టుకొంది చంచల, శ్యామలవైపు చూస్తూ.

ఈ సంఘటనవల్ల శ్యామలకు కొంచెం తృప్తి కలిగింది. "వీళ్ళ గర్వానికి తగినట్లే జరిగింది. మళ్లీ ఇంకోసారి పందిరి వేయించి ఇంకో పదివేలు ఖర్చు చేయనీ!" అనుకొంది.

బాధతో మూలుగుతున్న సోమయాజులు "నేను పడిపోతే మాత్రం ఇప్పుడు వచ్చిన నష్టం ఏముంది? నా తమ్ముణ్ణి పిల్చుకొని రండి. వాడూ, శ్యామలా పీటలమీద కూర్చుంటారు. తొందరగా వెళ్లి వాణ్ణి పిల్చుకొని రండి" అన్నాడు.

ఈ మాటలు విన్న తోడికోడళ్లు ఇద్దరూ ఉలిక్కిపడ్డారు! ఇద్దరు ముగ్గురు స్నేహితులు రాఘవరావుకోసం పరిగెత్తారు.

శ్యామల తనలోనే మెల్లిగా నవ్వుకొంది. ఈవిధంగానైనా వారిని కొంచెం గౌరవించినందుకు ఆమెకు కొంచెం తృప్తి కలిగింది

"ఇప్పుడు కావలసివచ్చాడు ఈ బీద తమ్ముడు! ఇప్పుడు కనిపించింది బంధుత్వం! పని జరగటం ప్రధానం కాబట్టి తమ్ముడు బీదవాడయినా ఇప్పుడు పుట్టుకొస్తోంది ప్రేమ! ...ఆయన రాకుండావుంటే బాగుండును... చూడటానికే రానన్న ఆయన ఈ శుభకార్యాలు జరిపించటానికి వస్తారా?...ఒకవేళ ఆయన వెంటనే వచ్చేస్తారేమో?... ఉహూ! ఒప్పుకోరు! నాకూ తనకీ బంధుత్వమే లేదన్న ఆయన వస్తారా? రారు! ఒక్కనాటికీ రారు......"

"టైమెంతయింది చంచలా?" అని భార్యను అడిగాడు సోమయాజులు.

"ఎనిమిది కావస్తోంది."

"అయ్యయ్యో! వాడు ఇంకా రాలేదా? ముహూర్తం మించిపోతుందేమో?"

"పోనిలెండి ఏంచేస్తాం? మీకు ఆరోగ్యం చేకూరాక మళ్ళీ ముహూర్తం పెట్టుకోవచ్చు" అంది చంచల, శ్యామలవైపు కోపంగా చూస్తూ.

"నోర్ముయ్! ఈ ముహూర్తం దాటటానికి వీల్లేదు, తమ్ముడు వుండగా నాకేం బాధ?"

"అవునవును. రాముడూ భరతుడూను అన్నతమ్ములు ఇద్దరూ"

శ్యామలకు కోపం ముంచుకొచ్చింది. "ఒకరు రాముడయితే, మరొకరు భరతుడే అవుతారు."

'చంచలా!' కోపంగా గట్టిగా అరిచాడు సోమయాజులు "మీయిద్దరూ దెబ్బలాడుకోదల్చుకుంటే ఎక్కడికేనాపోయి దెబ్బలాడుకోండి. ఇక్కడ ఆట్టే గొడవ చెయ్యకండి."

తోడికోడళ్ళు ఇద్దరూ బుసకొడ్తున్నట్లు మౌనంగా ఒకళ్ళనొకళ్లని చూస్కొన్నారు.

వాళ్లగుండెలు పరిగెత్తే రైలుచక్రాల వేగానికి అదిరే రైలుపట్టాలలా దడదడ అదిరాయి. రాఘవరావు అక్కడికి రాకుండా వుండాలనేదే వారిద్దరి ఆలోచన.

మరొక పావుగంట గడిచింది. సోమయాజులు కళ్ళుతెరచి చూశాడు. చంచల తన ఉక్రోషాన్ని వెళ్ళగక్కింది.

"ఆయనగారెందుకు వస్తాడు? ఎప్పుడైనా మంచీ, మర్యాద అనేది వుండిగనకనా?

శ్యామలమాత్రం తక్కువదా? "మర్యాదయిచ్చి మర్యాద పుచ్చుకోవాలి ఎవరయితేనేం?" అంది.

"అంతా నువ్వు నేర్పినదే!"

"అవును. నీవు నేర్పిన విద్యయే నీరజాక్ష అని ఊరికే అన్నారా మరి?"

"ఇప్పుడే నోరు ఇల్లా బయటపడుతోందే! ఇంకా బాగా డబ్బుకూడా వుందంటే..."

"డబ్బున్నవాళ్ళు అందరూ గుడ్డివాళ్ళు కారు."

"మీరిద్దరూ మర్యాదగా నోరుమూసుకొని కూర్చుంటారా లేదా?" అని కేకలేశాడు, కోపంగా సోమయాజులు.

తానొకటి తలచ దైవమింకొకటి తలచాడన్నట్లు తోడికోడళ్ల ఆలోచనలకు విరుద్ధంగానే జరిగింది. ప్రేమలో కలవని అన్నతమ్ములు తోడికోడళ్ల పగలో కలిశారు! సోమయాజులు ముఖంలో కనిపించిన కోపం మాయమయి సంతోషం తాండవమాడింది. అతని ఎదురుగా అతని తమ్ముడు రాఘవరావు నవ్వుముఖంతో నిలబడ్డాడు. ఇద్దరూ ఒకరినొకరు చూసుకుని తన్మయత్వం చెందారు. ఆ సంఘటన చూసిన తోడికోడళ్ళు ఇద్దరూ తెల్లబోయారు!

రాఘవరావుని పిలవటానికి వచ్చిన అతని అన్నగారి స్నేహితులైన భాగ్యవంతులు అతనిదగ్గరకు వచ్చినపుడు అతను ఒక నిజాన్ని తెలుసుకొన్నాడు; అర్థం చేసుకొన్నాడు; వెంటనే బయల్దేరి వచ్చేశాడు."

అతని అన్నగారు లక్షాధిపతి. అతను బీదవాడు. కాని అన్నగారు చెయ్యవలసిన పని ఒకటి దురదృష్టవశాత్తూ ఆగిపోయింది. ఆ స్థానంలో నిలబడి ఆ కార్యాన్ని పూర్తి చేయించగల హక్కు మరెవ్వరికీ లేదు! అతనికి ఒక్కడికే ఆ హక్కు వుంది. భగవంతుడు ఇచ్చిన హక్కు! ఐశ్వర్యంగాని, అధికారంగాని, తోడికోడళ్ల పగగాని అడ్డుపెట్టటానికి వీలేని హక్కు! ప్రకృతి సిద్ధమైన హక్కు! వాళ్లిద్దరూ ఒక్కటే. ఒకరిస్థానంలో మరొకరు నిలబడి ఆ కార్యం పూర్తిచేయించగల హక్కు వారికి మాత్రమే వుంది. రక్త సంబంధంవల్ల, పుట్టుకవల వచ్చేహక్కు! అదే బంధుత్వం.

"తనకూ నాకూ సంబంధమే లేదని అనుకోవటం ఎంత మూర్ఖత్వం! ఎంత అవివేకం! మాటలతో తోసివేయగల బంధుత్వమా ఇది? తోడికోడళ్లు ఎన్నివిధాల తగవులాడుకొన్నా తోసివేయగల బంధుత్వమా ఇది?" అని విచారించిన రాఘవరావు వెంటనే అన్నగారింటికి పరిగెత్తుకొచ్చాడు.

"ఎల్లా వుందన్నయ్యా?" అని ప్రియంగా అడిగాడు రాఘవరావు.

"నాకేం ఫరవాలేదురా, దెంగ పెట్టుకోకు. నువ్వూ శ్యామలా పీటలమీద కూర్చుని ఒకుకూ పెళ్లి లక్షణంగా పూర్తి చేయించండి. ఈ ముహూర్తానికి రామానికి కూడా ఒడుగుచెయ్యండి. తొందరగా స్నానంచేసి బట్టలు మార్చుకో-వెళ్లు" సోమయాజులు చాలా సహజ ధోరణిలో నే-మాట్లాడాడు.

అన్నగారి మాటలువిన్న రాఘవరావు తన్మయత్వం చెందాడు. తోడికోడళ్లు ఒకరినొకరు చూసుకొని సిగ్గుపడి పోయారు. సంవత్సరాల తరబడి విడిపోయివుంటున్న అన్నదమ్ములు అకస్మాత్తుగా కలిసిపోయేసరికి వాళ్లలో రగిలిన పగమాయమయి ఆనంద బాష్పాలు రాలాయి!

ఇంక తర్వాత చెప్పేందుకేముంది? ★



SEENU & CO., 28, THANDAVARAYA GRAMANI STREET, MADRAS-21. GRAMS ORCAS' (ESTD 1946) PHONE 55357
(ADVT PERMITTED UNDER G.O.MS.NO.1121 HEALTH)